నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 14 మే 2024 | YADADRI BHUVANAGIRI

భువనగిరిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

పోలింగ్‌లో భువనగిరి టాప్

ఓటెత్తిన చైతన్యం.. 76.47 శాతం పోలింగ్

- పోయిన సారి కంటే అధికంగా పోలైన ఓట్లు
- ఉదయం నుంచి ఒకే స్థాయిలో క్రమంగా పెరిగిన ఓటింగ్
- సాయంత్రం తర్వాత కేంద్రాలకు భారీగా బారులు
- రాత్రి వరకు ఓటును వినియోగించుకున్న ఓటర్లు

చౌటుప్పల్‌లో ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

యాదగిరిగుట్టలో ఓటు వేసి సిరా చూపిస్తున్న యువతి

చౌటుప్పల్‌లో..

యాదాద్రి భువనగిరి, మే 13 (నమస్తే తెలంగాణ) : లోక్ సభ ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. భువనగిరి పార్లమెంట్ స్థానంలో జనం చైతన్యం ప్రదర్శించారు. రాష్ట్రంలోనే ఇక్కడ అత్యధికంగా పోలింగ్ నమోదైంది. రాత్రి 12 గంటల వరకు 76.47శాతం ఓట్లు పోలై మొదటి స్థానంలో స్థానంలో నిలిచింది. పార్లమెంట్ స్థానంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. మునుగోడులో అత్యధికంగా 83.51శాతం పోలింగ్ జరిగింది. ఆ తర్వాత ఆలేరులో 82.52, భువనగిరిలో 81.74, నకిరేకల్‌లో 77.08, తుంగతుర్తిలో 73.70 శాతం ఓట్లు పోలయ్యాయి. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 66.81శాతం నమోదైంది.

పోయిన సారి కంటే అధికమే..

2019 లోక్‌సభ సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఈ సారి పోలింగ్ శాతం భారీగానే పెరిగిందని చెప్పవచ్చు. అప్పుడు మొత్తం 16,27,527 ఓటర్లు ఉండగా, 12,11,256 మంది ఓటేశారు. అంటే 74.42 శాతం పోలింగ్ నమోదైంది. ఆ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 81.82శాతం ఓట్లు పోలయ్యాయి. కాగా ఈ సారి ఎలక్షన్స్‌లో పార్లమెంట్ పరిధిలో సాయంత్రం ఐదింటి వరకే 80 శాతం ఓట్లు పోలయ్యాయి. రాత్రి వరకు 76.47శాతానికి చేరింది.

పోలింగ్ సరళి ఇలా..

ఎన్నికల పోలింగ్ సరళి గతానికి విభిన్నంగా కొనసాగింది. ఇది వరకు ఉదయం మందకొడిగా ఉండి.. మధ్యాహ్నం ఒక్కసారిగా పోలింగ్ పెరిగేది. కానీ ఈ సారి ఓటింగ్ తీరు మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే స్థాయిలో పోలింగ్ జరిగింది. ఎండల నేపథ్యంలో వీలైనంత త్వరగా ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తి చూపించారు. అనేక చోట్ల సాయంత్రం తర్వాత ఓటర్లు తండోపతండాలుగా తరలివచ్చారు. ఏడు నియోజకవర్గాలు పరిశీలిస్తే ఉదయం 7నుంచి 9గంటల వరకు 10.54శాతం ఓట్లు పోలయ్యాయి. 11గంటల వరకు 27.97శాతం నమోదైంది. మధ్యాహ్నానికి వచ్చేసరిగా కాస్త స్పీడ్ పెరిగింది. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దాదాపు 20శాతం వరకు పెరిగింది. ఒంటి గంట వరకు 46.49శాతం నమోదైంది. మూడు గంటల వరకు 62.05శాతం, ఐదు గంటల వరకు 72.34శాతం ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 6గంటల వరకు ఓటర్లు భారీగా పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. కొన్ని చోట్ల చివరలో డబ్బులు పంపిణీ చేస్తారేమో అనే ఆశతో సాయంత్రం వరకు పోలింగ్ బూత్‌లకు వెళ్లలేదు. ఒక్కసారిగా అంతా 4 నుంచి 5గంటల మధ్య పోలింగ్ కేంద్రాలకు బారులుదీరారు. 6గంటల వరకు కేంద్రాలకు చేరుకుని క్యూలో నిల్చున్నవారికి ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. కొన్ని చోట్ల రాత్రి ఎనిమిది గంటల వరకు ఓటు వేశారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం అధికారులు ఈవీఎంలకు సీల్ చేశారు.

రాజాపేట : రఘునాథ్‌పూరంలో ఓటు వేసేందుకు వెళ్తున్న వృద్ధులు

ఓటర్ల చైతన్యం..

పోలింగ్‌కు ఓటర్లు స్వచ్ఛందంగా తరలివచ్చారు. పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని ఓటేశారు. స్థానికంగా ఉన్న ఓటర్లే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సైతం భారీ సంఖ్యలో క్యూ కట్టారు. కుటుంబ సమేతంగా సొంత వాహనాలు, బస్సుల్లో సొంతూర్లకు వచ్చారు. హైదరాబాద్ నుంచి ఓటర్లతో హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-వరంగల్ రహదారులు నిండిపోయాయి. సాధారణంగా ఎన్నికలకు పార్టీలు పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేస్తాయి. పార్లమెంట్ ఎన్నికలు కావడంతో కాంగ్రెస్ మినహా ఏ పార్టీ కూడా డబ్బులు, తాయిలాలు పంపిణీ చేయలేదు. అయినప్పటికీ సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టుకొని సొంతూర్లకు వచ్చి ఓటేశారు.

పోలింగ్ సరళి ఇలా.. (శాతంలో..)

నియోజక వర్గం	9గంటల వరకు	11వరకు	1వరకు	3వరకు	5వరకు	12వరకు
ఇబ్రహీంపట్నం	8.79	21.97	38.62	52.03	63.13	66.81
మునుగోడు	13.32	32.61	50.37	67.6	79.67	83.51
భువనగిరి	9.13	27.01	47.26	66.22	74.24	81.74
నకిరేకల్	10.86	29.34	47.41	61.54	72.34	77.08
తుంగతుర్తి	10.65	29.98	49.19	62.36	71.3	73.70
ఆలేరు	10.53	29.26	50.44	68.41	79.12	82.52
జనగాం	10.84	27.5	45.03	60.4	70.25	74.19

శాలిగౌరారంలో తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్న భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

రామన్నపేట: మునిపంపుల గ్రామంలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న సీపీఎం అభ్యర్థి ఎండి జహంగీర్

మోటకొండూర్ : కదిరేణిగూడెంలో వేసిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి దంపతులు

యాదగిరిగుట్ట : వంగపల్లిలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ వైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

మోటకొండూర్ మండల కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ దపంతులు.

బీబీనగర్ : రహీంఖాన్‌గూడెం గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఇప్పుడు మారనుంది

- కేసీఆర్ పాలన లేని లోటు జనంలో స్పష్టంగా కనబడుతున్నది
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మే 13 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఇప్పుడు మారనుందని, ఐదు నెలల్లో జనం ఆలోచనల్లో పెనుమార్పులు వచ్చాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సూర్యాపేటలోని శ్రీ చైతన్య స్కూల్ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పాలన లేని లోటు స్పష్టంగా కనబడుతున్నదని ప్రజలే చెబుతున్నారని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజా స్పందన చూస్తుంటే మెజారిటీ సీట్లు తమవే అనే నమ్మకం కలుగుతుందని తెలిపారు. కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. లోక్ సభ ఎన్నికలతో ఊహిస్తున్న మార్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు

- కొన్ని సెంటర్లలో రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- వెబ్‌కాస్టింగ్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ పర్యవేక్షణ
- కేంద్రాల వద్ద వర్షం నీటితో ఓటర్లకు ఇబ్బందులు
- పోలీసుల పటిష్ట బందోబస్తు
- స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీ ఎంలు.. మూడంచెల భద్రత
- జూన్ 4 కౌంటింగ్.. ఫలితాల వెల్లడి

వర్షంతో చిత్తడిగా మారిన భువనగిరి మండలం కేసారం పోలింగ్ స్టేషన్ ఆవరణ

యాదాద్రి భువనగిరి, మే 13 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఉదయం పలు చోట్ల ఈవీఎంల మొరాయింపు మినహా అంతటా ప్రశాంతంగా జరిగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వర్షం నీరు చేరడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. రికార్డు స్థాయిలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో 80శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ తీరును అణువణువు సీసీ కెమెరాలో నిక్షిప్తం కావడంతో వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పోలింగ్ ముగియడంతో ఈవీఎంలకు సీల్ వేసి భువనగిరిలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగనుంది. అదే రోజు ఫలితాలు విడుదల చేయనున్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

ఎన్నికలను అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. భువనగిరి పార్లమెంట్ బరిలో 39మంది అభ్యర్థులు ఉన్నారు. మొత్తం 4,141 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఇందులో 852 సమస్యాత్మక, రెండు వల్నబురల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తంగా 8,023 బ్యాలెట్ యూనిట్లు, 2,673 కంట్రోల్ యూనిట్లు, 2,994 వీవీ ప్యాట్లు ఉపయోగించారు. సాంకేతిక కారణాలతో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే సమస్య రాకుండా 25శాతం అదనంగా సామగ్రిని అందుబాటులో ఉంచారు. ఒక్కో కేంద్రంలో మూడు ఈవీఎంలు, ఒక వీవీ ప్యాట్‌ను వినియోగించారు. సోమవారం సాయంత్రమే ఎన్నికల సిబ్బంది సంబంధిత పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అక్కడే ఏర్పాట్లన్నీ చూసుకుని రాత్రి బస చేశారు.

ఈవీఎంల మొరాయింపు..

పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5:30 గంటలకే ఈవీఎంలు తెరిచి మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆయా పార్టీల ఏజెంట్లను అనుమతించారు. అయితే.. కొన్ని చోట్ల సాంకేతిక కారణాలతో ఈవీఎంలు మొరాయించాయి. చౌటుప్పల్ మండలంలోని లింగోజిగూడెంలో 26వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. మోత్కూరు మండలంలోని అనాజిపురం, వలిగొండ మండలంలోని 255 పోలింగ్ కేంద్రం, భువనగిరి మండలంలోని గౌసనగర్‌లో ఈవీఎంలు కొద్దిసేపు ఆగిపోయాయి. మోటకొండూరు మండలంలోని చందేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 235/97 పోలింగ్ కేంద్రంలో ఓటరు ఈవీఎంపై సింబల్‌ను గట్టిగా నొక్కడంతో బటన్ స్టక్ అయ్యింది. దీంతో ఈవీఎం పనిచేయడం ఆగిపోవడంతో పోలింగ్ నిలిచిపోయింది. సాంకేతిక సిబ్బంది సరిచేశాక.. గంట తర్వాత పోలింగ్ పునఃప్రారంభమైంది. ఇక ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో కేంద్రాల వద్ద నీరు నిలవడంతో ఓటేసేందుకు వచ్చిన ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు భూదాన్ పోచంపల్లి మండలంలోని కనుముక్కుల గ్రామంలో రైతులు కాసేపు ఎన్నికలను బహిష్కరించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ధాన్యం బస్తాలతో రోడ్డెక్కారు.

76.47 శాతం పోలింగ్

సోమవారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ షురూ అయ్యింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, అదనపు ప్రిసైడింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్, మరో ముగ్గురు సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఓటరు స్లిప్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డు చూపించాక, క్షుణ్ణంగా పరిశీలించాకే సిరా గుర్తు వేసి ఓటుకు అనుమతించారు. పోలింగ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. పార్లమెంట్ పరిధిలో 18,08,585 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 8,98,98, 416, మహిళలు 9,10,090మంది ఉండగా, 79మంది ఇతరులు ఉన్నారు. 76.47 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు..

పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఈవీఎంలు, వీవీప్యాట్లు, బ్యాలెట్ పేపర్లను పకడ్బందీగా స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. పోలీసుల పర్యవేక్షణలో ఆయా పోలింగ్ స్టేషన్ల నుంచి రవాణా చేశారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్‌లను ఏర్పాటు చేశారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను భువనగిరిలోని అరోరా కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. మిషన్లను సీల్ చేసి భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర బలగాలు బందోబస్తు చేపడుతున్నాయి.

పటిష్ట పోలీస్ బందోబస్తు

పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు తమ వంతు కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర పోలీస్ సిబ్బందితోపాటు కేంద్ర బలగాలు విధులు నిర్వహించాయి. ఆదివారం రాత్రే పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. పోలింగ్ బూత్ వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పోలింగ్ సమయంలో బయటి వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకున్నారు. సీపీ తరుణ్ జోషి, డీసీపీ రాజేశ్‌చంద్ర ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి.. ఓటింగ్ తీరును పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అంచనాల్లో అభ్యర్థులు

- ఈవీఎం బాక్సుల్లో నిక్షిప్తమైన ఎంపీ అభ్యర్థుల భవితవ్యం
- పోలింగ్ సరళి, విజయావకాశాలపై సమాలోచనలు
- బూత్‌ల వారీగా పోలైన ఓట్ల లెక్కలపై ఆరా
- ఫలితాల వెల్లడికి 21 రోజుల గడువు

నల్లగొండ ప్రతినిధి, మే 13 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇక లెక్కింపు మాత్రమే మిగిలింది. అయితే ఫలితం తెలుసుకోవడానికి 21 రోజుల పాటు వేచి చూడాల్సిందే. దేశ వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో బరిలో నిలిచిన అభ్యర్థులతోపాటు రాజకీయ నాయకులు, జిల్లా ప్రజల్లోనూ ఫలితాలపై అప్పుడే అంచనాలు మొదలయ్యాయి. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం బాక్సుల్లో నిక్షిప్తం కాగా.. జననాడిని అంచనా వేసేందుకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుండగానే పలువురు ఆరా తీయడం కనిపించింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌తోపాటు బీజేపీ, సీపీఎం, స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎవరి లెక్కల్లో వారు మునిగి తేలుతున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నల్లగొండ, భువనగిరి స్థానాల అభ్యర్థుల భవితవ్యం వచ్చే నెల 4న తేలనుంది. రాష్ట్రంలో నాలుగో దశలో ఎన్నికలు జరుగగా, ఇంకా మూడు దశల ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. దేశ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత దేశమంతటా ఒకేసారి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఫలితం వెల్లడి కావడానికి ఇంకా 21 రోజుల సమయం ఉంది. దీంతో ఈ రోజు పోలింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల లెక్కలను సేకరించే పనిలో ప్రధాన పార్టీలు, వారి అభ్యర్థులు పడ్డారు. గతం కంటే ఈ సారి పోలింగ్ శాతం పెరుగడంతో అది ఎవరికి లాభిస్తుందనే దానిపై చర్చోపచర్చలు మొదలు పెట్టారు. మంగళవారం తుది పోలింగ్ లెక్కలు వెల్లడి కానున్న నేపథ్యంలో ఆ తర్వాత పోలింగ్ కేంద్రాలు, గ్రామాలు, మండలాల వారీగా, ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అంచనాలకు సిద్ధపడనున్నారు. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతోపాటు ఆ పార్టీ శ్రేణుల్లో పోలింగ్ ట్రెండ్‌పై తీవ్ర ఉత్కంఠత నెలకొంది. డిసెంబర్‌లో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిగణలోకి తీసుకుని కూడా ప్రస్తుత పోలింగ్ సరళిపై దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బూత్‌ల వారీగా పోలైన ఓట్ల లెక్కలను ముందేసుకుని ప్రస్తుత ఎన్నికల్లో ఎన్ని రావచ్చన్న దానిపైనా పార్టీ శ్రేణుల నుంచి వివరాలు తెప్పించుకునే పనిలో పడ్డారు. తమకు ఆయా బూత్‌ల వారీగా ఎన్నెన్ని ఓట్లు పడే అవకాశాలు ఉన్నాయనే లెక్కలను ప్రధాన పార్టీల అభ్యర్థులు వేస్తున్నారు. మరోవైపు సోమవారం పోలింగ్ జరుగుతుండగానే.. పలువురు మీడియా సిబ్బంది, సర్వే సంస్థల సిబ్బంది ఎగ్జిట్ పోల్స్ కోసం ఓటరు నాడిని తెలుసుకునే ప్రయత్నాలు చేస్తూ కనిపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ తమదే విజయమన్న ధీమా ఆ పార్టీ అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ కూడా ఓటర్లు పునరాలోచనతో తిరిగి కేసీఆర్‌కే జై కొట్టారని, తమకే విజయావకాశాలు ఉన్నట్లుగా లెక్కలు వేస్తున్నారు. ఇక బీజేపీ భువనగిరిలో విజయం తమదేనని, నల్లగొండలో సైతం తాము గణనీయంగా ఓట్లను సాధిస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చిట్యాల మండలం ఆరెగూడెం పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలకు సీల్ వేస్తున్న అధికారులు

విజయంపై ఎవరి ధీమా వారిదే..

డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అందులో కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ ఒక స్థానంలో విజయం సాధించాయి. నల్లగొండ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఒక్క సూర్యాపేట మినహా మిగతా అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ విజయం సాధించింది. భువనగిరి పార్లమెంట్ స్థానం పరిధిలోని జనగాంలో బీఆర్ఎస్ మినహా మిగతా అన్ని చోట్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. దీంతో ఈ సారి కూడా రెండు చోట్లా తమదే విజయమన్న ధీమా కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. 2019లో బీఆర్ఎస్ 9 మంది ఎమ్మెల్యేలను గెలుపొందినా కాంగ్రెస్ రెండు ఎంపీ స్థానాలను గెలుచుకున్నట్లే.. ఈ సారి బీఆర్ఎస్ కూడా అదే విధంగా రెండు స్థానాల్లో విజయం సాధిస్తుందన్న విశ్వాసాన్ని బీఆర్ఎస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఐదు నెలల కాలంలో కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత తమకు విజయానికి దోహదం చేస్తున్న నమ్మకంతో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. ఇక మోదీ చరిష్మాతోపాటు బూర నర్సయ్యగౌడ్ గతంలో ఎంపీగా ప్రజలకు చిరపరిచితుడు కావడంతో భువనగిరిలో విజయం తమదేనని కమలం నేతలు ఢంకా బజాయించి చెప్తున్నారు. ఇలా ఎవరి ధీమాలో వారు ఉన్నా.. ఓట్ల లెక్కింపునకు మరో మూడు వారాల గడువు ఉండడంతో అప్పటివరకు చర్చోపచర్చలు, అంచనాలపై అంచనాలు కొనసాగనున్నాయి.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది

63 మందిలో 11 మంది నామినేషన్లు ఉపసంహరణ

ఈ నెల 27న ఎన్నికలు, వచ్చే నెల 5న కౌంటింగ్

నల్లగొండ, మే 13 : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 69 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. అందులో ఈ నెల 10న ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 63 మంది అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల యంత్రాంగం అంగీకరించింది. వారిలో 11 మంది సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దాంతో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నల్లగొండ కలెక్టరేట్‌లోని శాసనమండలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌కు అభ్యర్థులు తమ నామినేషన్ల ఉపసంహరణ పత్రాలను సమర్పించారు. కాగా, పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం ఈ నెల 2న నోటిఫికేషన్ వేయగా.. తొమ్మిది వరకు నామినేషన్లు స్వీకరించి పదో తేదీన స్క్రూట్నీ నిర్వహించారు. ఈ ఎన్నిక ఈ నెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు బ్యాలెట్ పద్ధతిలో జరుగనుండగా.. జూన్ 5న ఎలిమినేషన్ పద్ధతిలో కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడించనున్నారు. ఓటర్లు ప్రాధాన్యత పద్ధతిలో తమ ఓటును ఎంత మందికైనా వేసేందుకు అవకాశం ఉంది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలో 34 నియోజకవర్గాలతో కూడి ఉన్న ఈ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో మొత్తం 4,63,839 మంది ఓటర్లు ఉన్నారు.

వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి 605 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అత్యల్పంగా సిద్ధిపేటలో 4,679 మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా ఖమ్మంలో 83,870 మంది ఓటర్లు ఉన్నారు. దానికి అనుగుణంగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ ఓట్ల లెక్కింపు నల్లగొండ పట్టణ శివారులోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న రాష్ట్ర గిడ్డంగుల శాఖ గోదాములో జూన్ 5న జరుగనుంది.